సాక్షి
నంద్యాల
శనివారం । 30 । ఆగస్టు । 2025



గోసంరక్షణ నిధికి విరాళం

శ్రీశైలంటెంపుల్: గోసంరక్షణనిధికి హైదరాబాద్‌కు చెందిన ఎ.బాలబ్రహ్మాచారి రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు. దాతకు జ్ఞాపికను అందించి సత్కరించారు.



అలా వెళ్లి.. ఇలా రావడమే!

శ్రీశైల దేవస్థానం నుంచి ఇతర ఆలయాలకు బదిలీ అయిన ఉద్యోగులు రెండు నెలల్లోనే తిరిగి వస్తున్నారు. వీరికి 888 జీఓ, అనారోగ్య సమస్యలు సహకరిస్తున్నాయి.

8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,626.00
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:79.798
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:53,122
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:58,322

న్యూస్‌రీల్

వచ్చే నెల 22 నుంచి దసరా ఉత్సవాలు



మాట్లాడుతున్న ఈఓ శ్రీనివాసరెడ్డి

మహానంది: వచ్చే నెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు మహానందిలో దసరా నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. దేవస్థానం కార్యాలయంలో శుక్రవారం పండితులు, ప్రధాన, ఉప ప్రధాన, ముఖ్య అర్చకులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ.. గత ఏడాది కంటే దసరా నవరాత్రి ఉత్సవాలు మరింత వైభవంగా నిర్వహించాలన్నారు. దాతల సహకారం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ మాట్లాడుతూ.. ప్రతి రోజూ అలంకరణలతో పాటు విశేష పూజలు ఉంటాయన్నారు. ఏఈఓ మధు, ఆలయ సూపరింటెండెంట్లు అంబటి శశిధర్‌రెడ్డి, పి.సుబ్బారెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కంట్రోల్ రూమ్‌లో పీజీఆర్ఎస్ అర్జీలపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. జూన్ 2024 నుంచి ఇప్పటి వరకు 41,247 అర్జీలు రాగా 38,862 పరిష్కారాలు జరిగాయన్నారు. ప్రజా వినతులకు సరైన సమాధానాలు ఇవ్వని గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ఉన్న 230 మంది అధికారులకు మెమోలు జారీ చేసి 13,403 వినతులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. పీజీఆర్ఎస్ సమస్యల పరిష్కారంలో నంద్యాల జిల్లాను మొదటి స్థానంలో నిలపాలన్నారు.

గిడుగు రామ్మూర్తి సేవలు ఎనలేనివి

కర్నూలు(అర్బన్): తెలుగు వైభవం కోసం పోరాటం నిర్వహించిన గొప్ప వ్యక్తి గిడుగు రామ్మూర్తి అని, ఆయన సేవలు ఎనలేనివని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా స్థానిక మినీ సమావేశ భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఈఓ మాట్లాడుతూ.. గిడుగు రామ్మూర్తి 1863 ఆగస్టు 29వ తేదీన జన్మించారన్నారు. తెలుగు వాడుక భాష పితామహుడుగా, గ్రాంధికభాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుకలోకి తీసుకువచ్చేందుకు ఎంతో కృషి చేశారన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీలోని వివిధ విభాగాలకు చెందిన పరిపాలనాధికారులు సీ మురళీమోహన్‌రెడ్డి, బసవశేఖర్, రాంగోపాల్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎంబీబీఎస్ మొదటి విడత అడ్మిషన్లు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కళాశాలలో మొదటి విడత స్టేట్ కోటా ఎంబీబీఎస్ అడ్మిషన్లు శుక్రవారం ముగిశాయి. ఇందులో భాగంగా మంగళవారం 16 మంది, బుధవారం 10 మంది, గురువారం అధికంగా 110 మంది, చివరి రోజైన శుక్రవారం 15 మంది అడ్మిషన్ తీసుకున్నారు. ఇప్పటికే నేషనల్ కోటాలో 37 సీట్లకు గాను 28 మంది అడ్మిషన్ తీసుకున్నారు. రాష్ట్ర కోటా, నేషనల్ కోటాలో మిగిలిన సీట్లకు తర్వాతి విడత కౌన్సెలింగ్‌లలో భర్తీ చేయనున్నారు.

సహకార శాఖలో 27 మందికి పదోన్నతులు

కర్నూలు(అగ్రికల్చర్): సహకార శాఖలో ఉమ్మడి జిల్లాకు సంబంధించి 27 మందికి పదోన్నతులు లభించాయి. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం సహకార శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ముగ్గురికి అసిస్టెంట్ రిజిస్ట్రార్ నుంచి డిప్యూటీ రిజిస్ట్రార్‌గా పదోన్నతి లభించింది. అసిస్టెంట్ రిజిస్ట్రార్ అయిన శివరామకృష్ణను ఆత్మకూరు నుంచి నంద్యాల సహకార ఆడిట్ అధికారిగా, రుక్సానా బేగంను కర్నూలు డీసీఓ ఆఫీస్ నుంచి నంద్యాల డీఎల్‌సీఓగా నియమించారు.

అధ్యక్ష పీఠం.. విభేదాల సుడిగుండం!

నంద్యాల తెలుగుదేశం పార్టీలో అసమ్మతిజ్వాల రగులుతోంది. అధ్యక్ష పదవి కోసం ఎమ్మెల్యేలు, పార్టీ నేతల మధ్య విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. నియోజక వర్గంలో తనకు పోటీ ఎవ్వరూ ఉండకూడదని అఖిల యత్నిస్తుంటే, రాజకీయ వారసత్వాన్ని నిలుపుకునేందుకు మంత్రి ఫరూక్ పోరాడుతున్నారు. ఇదే క్రమంలో జిల్లాలో అత్యధిక ఓటు బ్యాంకు ఉన్న బీసీ కోటాలో రాము యాదవ్, బలిజ వర్గానికి చెందిన నరసింహారావు కూడా పోటీలో నిలిచారు. వీరిలో కొందరిపై స్థానిక ఎమ్మెల్యేలు బెదిరింపులకు దిగి పోటీలో ఉండకూడదని హుకుం జారీ చేయడం గమనార్హం.



నంద్యాల టీడీపీలో అసమ్మతి జ్వాల

- జిల్లా అధ్యక్షుడిగా భూమా విఖ్యాత్‌ను తెరపైకి తెచ్చిన అఖిల
- పదవి దక్కించుకునేందుకు బరిలో నరసింహారావు
- నంద్యాలలో బలిజలతో ఆత్మీయ సమావేశం, సంతకాల సేకరణ
- తన ప్రమేయం లేకుండా ఆళ్లగడ్డ వాసి పోటీపై అఖిల కన్నెర్ర
- బీసీ కోటాలో అధ్యక్ష పదవి దక్కించుకునేందుకు రాముయాదవ్ యత్నం
- కుమారుని కోసం మంత్రి ఫరూక్ విశ్వప్రయత్నాలు
- మూడు పేర్లను సిఫారసు చేయనున్న త్రీమెన్ కమిటీ

మరో పవర్‌సెంటర్ లేకుండా అఖిల జాగ్రత్తలు

ఆళ్లగడ్డలో భూమా అఖిలప్రియ రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆమె వైఖరితో నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులతో పాటు కుటుంబ సభ్యులు కూడా దూరమయ్యారంటే ఏడాదిలోనే ఎంత ప్రజావ్యతిరేకతకు కూడగట్టుకున్నారో తెలుస్తోంది. పార్టీ అధిష్టానం కూడా అఖిల విషయంలో అసంతృప్తిగానే ఉంది. ఈ క్రమంలో 2029 ఎన్నికల్లో టిక్కెట్ ఇవ్వరనే చర్చ కూడా పార్టీలో నడుస్తోంది. దీంతో ఇటు కుటుంబ సభ్యుల్లో, అటు పార్టీలో వ్యతిరేక వర్గాలు బలపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆళ్లగడ్డలో తన కుటుంబం మినహా ఎవ్వరూ 'పవర్ సెంటర్'గా మారేందుకు వీల్లేదు అనేలా అఖిల వ్యవహరిస్తున్నారు. బలిజ వర్గానికి చెందిన నరసింహారావు అధ్యక్ష పదవి కోసం పోటీ పడ్డారు. ఈ నెల 26న ఇంటి ఆదినారాయణకు చెందిన శ్యామల ఆస్పత్రిలో బలిజల ఆత్మీయ సమావేశం పేరుతో నరసింహారావు సంతకాల సేకరణ చేశారు. ఇది తెలిసి అఖిల తన పీఏ మోహన్‌తో 20మంది అనుచరులను ఆస్పత్రికి పంపారు. నరసింహారావు శిరివెళ్లవాసి. తన నియోజకవర్గంలో, తన సిఫార్సు లేకుండా పదవికి పోటీ పడటంపై అఖిల భగ్గుమన్నారు. పోటీపడుతున్న నరసింహారావుతో పాటు ఆస్పత్రి యజమాని ఆదినారాయణకు అఖిల ముఠా బెదిరింపులకు దిగినట్లు తెలిసింది. ఈ గొడవ డీఎస్పీతో పాటు ఎస్పీ దృష్టికి చేరినట్లు తెలుస్తోంది.

కమిటీ సిఫార్సు చేసిన పేర్లు ఇవే..

అధ్యక్ష పదవి కోసం ఓసీ, బీసీ, ఎస్సీ వర్గానికి చెందిన రెండు పేర్ల చొప్పున మొత్తం 6 పేర్లను పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఆరుగురిలో మూడు పేర్లను అధిష్టానానికి పంపనుంది. రామచంద్రరావు, నరసింహారావు, ఫిరోజ్, ధర్మవరం సుబ్బారెడ్డి, తులసిరెడ్డి, వెంటస్వామితో పాటు మల్లెల రాజశేఖర్ పేర్లు పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. కుల సమీకరణల ఆధారంగా పదవిని కట్టబెట్టనున్నారు.

సాక్షి ప్రతినిధి కర్నూలు: తెలుగుదేశంపార్టీ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కమిటీలను నియమిస్తోంది. ఈ క్రమంలో నంద్యాల జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఈ నెల 26న నిర్వహించారు. పార్లమెంట్ కమిటీ, అనుబంధ కమిటీల కోసం ఈ సమావేశంలో ప్రతిపాదనలు స్వీకరించారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, అనంతపురం మాజీ జెడ్పీ చైర్మన్ పూల నాగరాజు, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర (నాని)లు నంద్యాల జిల్లా త్రీమెన్ కమిటీలో ఉన్నారు.

బీసీల పేరుతో బరిలో రాము యాదవ్

ఆళ్లగడ్డ వాసి రాముయాదవ్ (బంగారు రాము) కూడా అధ్యక్ష పోటీలో ఉన్నారు. ఇతను ఏకంగా రాష్ట్ర అధ్యక్షుడికి పార్లమెంట్ ప్రజల పేరుతో లేఖ రాశారు. యాదవ, కురువతో పాటు 3లక్షలకు పైగా బీసీ ఓటర్లు ఉన్నారు, బీసీలకు న్యాయం చేయాలంటే రాముకు పదవి కట్టబెట్టాలని లేఖ రాశారు. అధ్యక్ష పదవి కోసం త్రీమెన్ కమిటీ మూడు పేర్లు సిఫార్సు చేయాలి. ఈ మూడు పేర్లను ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు మొదట త్రీమెన్ కమిటీకి సిఫార్సు చేయాలి. అయితే నరసింహారావు, రాము ఇద్దరికీ అఖిల సిఫార్సు చేయలేదు. త్రీమెన్ కమిటీలో ఎలాగైనా నరసింహారావు పేరు ఉండేందుకు యత్నిస్తున్నారు. చంద్రబాబు సన్నిహితుడు ఎస్ఆర్ఐ గురురాజ (డాలర్ రాజ) సిఫార్సుతో పదవి దక్కించుకోవచ్చని నరసింహారావు భావిస్తున్నారు. జిల్లాలో బలిజలు సుమారు 2.50లక్షలు ఉన్నారని, బలిజలకు పదవి ఇవ్వాలని డాలర్‌రాజ ద్వారా యత్నిస్తున్నారు.

వారసత్వం కోసం మంత్రి ఫరూక్ తపన

మంత్రి ఫరూక్ మొన్నటి ఎన్నికల్లోనే తన కుమారుడు ఫిరోజ్‌కు టిక్కెట్ ఇప్పించుకోవాలని యత్నించారు. కానీ అధిష్టానం ఒప్పుకోలేదు. ఫిరోజ్ వ్యవహారం నియోజకవర్గంలోని టీడీపీ నేతలు ఏ ఒక్కరికీ మింగుడుపడటం లేదు. ఫరూక్‌తోనే రాజకీయం ముగుస్తుందని, వారసత్వం ఉండదనే చర్చ సాగుతోంది. ఈక్రమంలో ఎలాగైనా ఫిరోజ్‌ను అధ్యక్షుడిగా నిలిపి రాజకీయంగా ముందుకు తీసుకొచ్చేందుకు మంత్రి ప్రయత్నిస్తున్నారు. అలాగే జగత్ విఖ్యాత్‌ను అధ్యక్షుడిగా నిలిపి, భవిష్యత్‌లో తనకు టిక్కెట్ ఇవ్వని పరిస్థితులు తలెత్తితే అతడిని బరిలో దింపేందుకు.. రాజకీయంగా తమ్ముడిని ఒక మెట్టు పైకి ఎక్కించేందుకు అఖిల యత్నిస్తోంది. అయితే జగత్‌ను త్రీమెన్ కమిటీ ఒప్పుకోలేదని తెలుస్తోంది.

శ్రీశైలానికి స్థిరంగా వరద

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలానికి వరద స్థిరంగా కొనసాగుతోంది. శుక్రవారం తొమ్మిది రేడియల్ క్రస్ట్‌గేట్లను తెరచి 2,38,626 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాయంత్రం సమయానికి జలాశయంలో 197.0114 టీఎంసీల నీరు నిల్వ ఉండగా.. డ్యాం నీటి మట్టం 881.60 అడుగులకు చేరుకుంది. గురువారం నుంచి శుక్రవారం వరకు జలాశయానికి ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి 2,83,105 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. జలాశయం నుంచి దిగువ ప్రాజెక్ట్‌లకు 3,41,558 క్యూసెక్కుల నీటిని వదిలారు. నాగార్జునసాగర్‌కు స్పిల్‌వే ద్వారా 2,40,850 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పాదన అనంతరం 68,272 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి హంద్రీనీవా సుజలస్రవంతికి 2,430 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 30వేల క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు. డ్యాం పరిసరప్రాంతాలలో 15.20 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కుడిగట్టు కేంద్రంలో 14.480 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 16.725 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు.



క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

డీసీఎంఎస్‌లో కొత్త బ్రాంచీలు

- వెల్దుర్తి, ఆస్పరిలో ఏర్పాటుకు చర్యలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) కొత్త బ్రాంచీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో డీసీఎంఎస్ ప్రాధాన కార్యాలయంతో కలిపి 17 బ్రాంచీలు ఉన్నాయి. డీసీఎంఎస్‌కు కొత్త పాలక వర్గం ఏర్పాటు తర్వాత కొత్త బ్రాంచీల ఏర్పాటు ప్రక్రియను చేపట్టారు. మొదటగా వెల్దుర్తి, ఆస్పరిలో బ్రాంచీలు ఏర్పాటు కానున్నాయి. ఇప్పటికే ఆఫీసు, గోదాముకు అవసరమైన భవనాలను గుర్తించారు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల వ్యాపారం కోసం లైసెన్స్‌ల కోసం వ్యవసాయ శాఖకు దరఖాస్తు చేశారు. వీటి ఏర్పాటు తర్వాత బేతంచెర్లలో కూడా బ్రాంచీ ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో డీసీఎంఎస్ పాలక వర్గం ఉంది.

శాస్త్రోక్తంగా స్వాతి మహోత్సవం

ఆళ్లగడ్డ: దిగువ అహోబిలంలో స్వాతి మహోత్సవాన్ని శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాములను అమృతవల్లీ అమ్మవార్లను దేవాలయం ఎదురుగా యాగశాలలో కొలువుంచారు. అభిషేకం, అర్చన, తిరుమంజనం అనంతరం ఉత్సవమూర్తులను అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్య స్వాతి, సుదర్శన హోమాలు వైభవోపేతంగా నిర్వహించారు. పూర్ణాహుతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాత్రి ఉత్సవ పల్లకీలో ఉభయ దేవేరులతో కొలువైన శ్రీ ప్రహ్లాదవరదుడు మాడ వీధుల్లో సంచరిస్తూ భక్తులకు కనువిందు చేశారు.



ఉత్సవంలో కొలువైన ఉత్సవమూర్తులు



సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఉద్యోగం దోబూచులాడుతోంది!

గురు 'భ్రమ'ణం

- డీఎస్సీలో కటాఫ్ మార్కులను ప్రకటించని రాష్ట్ర ప్రభుత్వం
- సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు మాత్రమే కాల్ లెటర్లు
- రెండు రోజుల్లో 2,525 మందికి కాల్ లెటర్లు
- 12 మంది గైర్హాజరు
- గ్రీవెన్స్‌లో లేవనెత్తిన సమస్యలకు సమాధానం కరువు

కర్నూలు సిటీ: డీఎస్సీ పోస్టుల భర్తీ ప్రక్రియలో కటాఫ్ మార్కులను ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం తేల్చలేదు. దీంతో అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. తుది జాబితా జారీ చేయకపోవడం, రోస్టర్ కటాఫ్ మార్కులు తెలియక పోవడం.. అయినా సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయడంతో ఉపాధ్యాయ ఉద్యోగం వస్తుందా? రాదా? అనే అనుమానాలు అభ్యర్థులను వెంటాడుతున్నాయి. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు మాత్రమే కాల్ లెటర్లు అని, ఉద్యోగానికి ఎంపికైనట్లు కాదని అందులో ఉండడంతో మరింత ఆందోళన చెందుతున్నారు. గురు, శుక్రవారాల్లో రెండు రోజుల పాటు అభ్యర్థులకు కాల్ లెటర్లు పంపించారు. దరఖాస్తు చేసిన సమయంలో అప్‌లోడ్ చేసిన అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. మొదటి రోజున 2,307 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన తెల్లవారుజామున 5 గంటల వరకు జరిగింది. రెండో రోజున 218 మంది కాల్ లెటర్లు రాగా శ్రీలక్ష్మీ శ్రీనివాస బీఈడీ కాలేజీలో వారి సర్టిఫికెట్లను పరిశీలించారు. వీరిలో 12 మంది అభ్యర్థులు మాత్రం హాజరుకాలేదని విద్యాశాఖ అధికార వర్గాలు చెబుతున్నాయి. వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యలతో కాల్ లెటర్లు వచ్చినట్లు మెసేజ్ మొబైల్‌కి పంపించారు. అయితే వెబ్‌సైట్‌లో కాల్ లెటర్లు డౌన్‌లోడ్ కాలేదు. దీంతో డీఈఓ శామ్యూల్ పాల్ డీఎస్సీ కన్వీనర్ దృష్టికి తీసుకపోవడంతో టెక్నికల్ టీం సహకారంతో కాల్ లెటర్లు డౌన్‌లోడ్ కావడంతో సాయంత్రం సర్టిఫికెట్లను పరిశీలించారు.

తేలని లెక్క

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,645 ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ పోస్టులకు 39,997 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల తుది మెరిట్ జాబితాను విడుదల చేయకుండానే కామన్ మెరిట్ జాబితా విడుదల చేశారు. ఉద్యోగాలకు ఎంపికైతారనే వారికి కాల్ లెటర్లు పంపించి, వారి సర్టిఫికెట్లను పరిశీలించారు. మొత్తం 2,525 మందికి మాత్రమే కాల్ లెటర్లు వచ్చాయి. నోటిఫికేషన్‌లో ఇచ్చిన పోస్టుల ప్రకారం 120 మందికి కాల్ లెటర్లు రావాలి. అయితే నాన్‌లోకల్‌లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు ఉద్యోగాలు సాధించారు. వారికి ఆయా జిల్లాల్లోనే అవకాశం ఇవ్వడంతో సర్టిఫికెట్ల పరిశీలనకు రాలేదు. ఆయా జిల్లాలో ఎంత మంది నాన్ లోకల్ కింద వెరిఫై చేయించకున్నారు అనే లెక్క తేలాల్సి ఉంది. ఆ తరువాతే మిగిలిన వారికి కాల్ లెటర్లు పంపించాలనే విషయంపై స్పష్టత వస్తుంది. మొత్తం 120 మందిలో స్పోర్ట్స్ కోటా పోస్టులకు ఎంపికైన వారికి నేరుగా ఉద్యోగ నియమాలు ఇవ్వనున్నారు. ప్రాధాన్యత పోగా ఎన్ని పోస్టులు మిగులుతాయి..ఏ క్యాటగిరి పోస్టులు అనేది స్పష్టంగా తేలాల్సి ఉంది. కాగా.. కొన్ని పోస్టులకు అర్హులైన అభ్యర్థులే లేరని తెలుస్తుంది.



వెరిఫికేషన్‌కు హాజరైన అభ్యర్థులు

పరిశీలన కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



అధికారులకు సూచనలు చేస్తున్న కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

శ్రీలక్ష్మీ శ్రీనివాస బీఈడీ కాలేజీలో డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తనిఖీ చేశారు. అదే విధంగా పాఠశాల విద్య జాయింట్ డైరెక్టర్ అబ్రహం, వయోజన విద్య అడిషనల్ డైరెక్టర్ బి.ప్రతాప్ రెడ్డి సైతం తనిఖీ చేశారు. తమ కంటే తక్కువ మార్కులు వచ్చిన వారికి కాల్ లెటర్లు వచ్చాయని అధికారుల దృష్టికి కొందరు తీసుకెళ్లారు. ఇలాంటి సమస్యలపై గ్రీవెన్స్ తీసుకోవాలని డీఈఓ శామ్యూల్ పాల్‌కు జిల్లా కలెక్టర్ సూచించారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు 'రాజ'బాట

- డోన్ కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశాలు ప్రారంభం
- మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరవ
- నంద్యాల జిల్లా విద్యార్థులకు ఎంతో మేలు

డోన్: అత్యున్నత విద్యను బోధిస్తూ విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసే కేంద్రీయ విద్యాలయం అందుబాటులోకి వచ్చింది. డోన్ కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. ఇందుకోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి డోన్ నియోజకవర్గ శాసనసభ్యులు, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ అధికారులతో సంప్రదింపులు జరిపి అప్పటి ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి సహకారంతో డోన్‌కు కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేయించారు.

ఐటీఐ విద్యార్థుల వసతి గృహం కేంద్రంగా..

కేంద్రీయ విద్యాలయాన్ని డోన్‌లో రెండేళ్ల క్రితమే ప్రారంభించాలనుకున్నారు. ఇందుకోసం ప్రభుత్వ ఐటీఐలో రూ.3కోట్లతో నిర్మించిన విద్యార్థుల వసతిగృహాన్ని విద్యాలయం నిర్వహణకు ఎంపిక చేశారు. బాత్రూం, సైన్స్‌ల్యాబ్, గ్రంథాలయం, వెంటిలేటర్స్, కిచెన్, హాస్టల్ వసతి తదితర ఫీజుబులిటీ సర్టిఫికెట్లను కూడా సంబంధిత అధికారులతో మాట్లాడి ఇప్పించారు. ఈ విద్యాలయాన్ని ప్రారంభించకుండా టీడీపీ ఎంపీ బైరెడ్డి శబరి విఫలయత్నం చేశారు.

అడ్మిషన్లు ప్రారంభం

కేంద్రీయ విద్యాలయంలో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ స్థాయివరకు చదవొచ్చు. ప్రస్తుత ఏడాదికి కేవలం ఒకటి నుంచి ఐదో తరగతి వరకే నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వ ఐటీఐలో 2025-26 విద్యా సంవత్సరానికి గానూ దరఖాస్తులు స్వీకరించేందుకు ఏర్పాట్లు చేశారు. సెప్టెంబర్ 8వ తేదీ వరకు తమ దరఖాస్తు ఫారాలను స్థానిక కార్యాలయంలో అందజేసే అవకాశాన్ని కల్పించారు. సెప్టెంబర్ 11వ తేదీన లాటరీ పద్ధతిలో డ్రా తీసి 12వ తేదీన తుది జాబితా ప్రకటిస్తారు. సెప్టెంబర్ 15 నుంచి 20వ తేదీ వరకు ప్రవేశాలు కల్పిస్తారు.





కేంద్రీయ విద్యాలయ భవనం, కేంద్రీయ విద్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న అప్పటి ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి (ఫైల్)



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

డోన్‌కే తలమానికం



గత ప్రభుత్వ హయాంలో నంద్యాల జిల్లాలోనే డోన్ విద్యారంగంలో అగ్రస్థానం పొందింది. వెటర్నటీ పాలిటెక్నిక్, గొర్రెల పెంపకం శిక్షణ కేంద్రం, పాలిటెక్నిక్, ప్రభుత్వ ఐటీఐ, ఎస్సీ, బీసీ బాల, బాలికల గురుకుల పాఠశాల, ఉర్దూ పాఠశాలలను మంజూరు చేయించడమే కాక అత్యాధునిక వసతులతో భవనాలు నిర్మించడం చరిత్రలో నిలిచిపోతోంది. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుతో విద్యారంగంలో డోన్ అగ్రభాగాన నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. – మాణిక్యం శెట్టి, ఉపాధ్యాయ సంఘం నేత

చాలా ఆనందంగా



అత్యంత ఆధునిక వసతులతో నిర్మించిన భవనంలో కేంద్రీయ విద్యాలయాన్ని నిర్వహించడం డోన్ ప్రజల అదృష్టంగా భావిస్తున్నారు. గత రెండేళ్లుగా కలలు కన్న కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు ఇప్పుడు నెరవేరినందుకు చాలా ఆనందంగా ఉంది. డోన్ ప్రజలు గర్వకారణంగా భావించే ఈ విద్యాలయం ఏర్పాటుకు విశేష కృషిచేసిన మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని ఎన్నటికీ మరిచిపోరు.

– ఖాజా, సౌత్‌సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ నాయకులు, డోన్

అనితర సాధ్యం



కేంద్ర ప్రభుత్వంలో తనకు ఉన్న పలుకుబడితో మాజీ మంత్రి బుగ్గన డోన్‌కు కేంద్రీయ విద్యాలయాన్ని సాధించిపెట్టారు. జిల్లా కేంద్రానికి తప్ప అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రానికి మంజూరు కాదనుకున్న విద్యాలయాన్ని అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో సాధించి చూపిన అనితర సాధ్యుడు మాజీ మంత్రి బుగ్గన. ఆయన కృషిని నియోజకవర్గ ప్రజలు ఎన్నటికీ మరిచిపోరు.

– రేగటి రాజశేఖర్ రెడ్డి, ఎంపీపీ, డోన్

క్లుప్తంగా

ఆస్పరి మార్కెట్ @ కోటి

ఆస్పరి: మేజర్ గ్రామ పంచాయతీ ఆస్పరి దినసరి కూరగాయల మార్కెట్ వేలం రికార్డు స్థాయి లో రూ. కోటి పలికింది. శుక్రవారం పంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్ మూలింటి రాధమ్మ ఆధ్వర్యంలో 2025–26 సంవత్సరానికి సంబంధించి దినసరి కూరగాయల మార్కెట్ వే లాన్ని పంచాయతీ కార్యదర్శి విజయరాజు నిర్వహించారు. ఇందులో 9 మంది పాట దారులు రూ. 5 లక్షలు సాల్వెన్సీ, రూ. 2 లక్షలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన్నారు. వేలం పోటాపోటీగా సాగింది. చివరకు ముల్లా మెహబూబ్ అనే వ్యక్తి కోటి రూపాయలు ఎక్కువ ధర పాడి మార్కెట్ హక్కులను దక్కించుకున్నారు. గత ఏడాది రూ. 65 లక్షలు పలకగా ఈసారి కోటి రూపాయలు పలకడంతో పంచాయతీకి రూ.35 లక్షల ఆదాయం పెరిగింది. ఆస్పరి మార్కెట్ చరిత్రలోనే ఎక్కువ పాడిన మొత్తంగా నిలిచింది. వేలంలో ఎంపీడీఓ గీతావాణి, ఉప సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆస్పరి సీఐ గంగాధర్ ఆధ్వర్యంలో 60 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బార్ల అనుమతులకు నేడు లక్కీ డిప్



ఎక్సైజ్ ప్రధాన కార్యాలయంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్న ఆశావహులు

కర్నూలు: జిల్లాలో మద్యం బార్ల ఏర్పాటుకు సంబంధించిన నోటిఫికేషన్‌కు ఆశావహుల నుంచి స్పందన అంతంత మాత్రమే వచ్చింది. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. మూడేళ్ల కాల పరిమితితో కర్నూలులో ఓపెన్ కేటగిరీ కింద 16, గౌడ కులాలకు 2, ఆదోనిలో ఓపెన్ కేటగిరీ కింద 4, గౌడ కులాలకు 1, ఎమ్మిగనూరులో 2, గూడూరులో ఒకటి చొప్పున మొత్తం 26 బార్లకు లైసెన్సుల కేటాయింపునకు నోటిఫికేషన్ జారీ అయిన సంగతి తెలిసిందే. కనీసం 4 దరఖాస్తులు దాఖలయ్యే బార్లకే లాటరీ విధానంలో లైసెన్స్ కేటాయిస్తామని ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఈ లెక్కన గడువు ముగిసే సమయానికి ఓపెన్ కేటగిరీ కింద ఉన్న 23 బార్లకు గాను 15 బార్లకు 60 దరఖాస్తులు, గౌడ కులాలకు రిజర్వు చేసిన 3 బార్లకు 17 దరఖాస్తులు వచ్చాయి. కర్నూలు కార్పొరేషన్ పరిధిలో మరో 5 బార్లకు, ఎమ్మిగనూరు మున్సిపాలిటీలో 2, గూడూరులో ఒకటి బార్ ఏర్పాటుకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. జెడ్పీ సమావేశ భవనంలో లక్కీడిప్ నిర్వహణకు ఎక్సైజ్ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మద్యం బార్ల ఏర్పాటుకు లైసెన్సుల జారీకి శనివారం ఉదయం 8 గంటలకు లక్కీ డిప్ నిర్వహించను న్నారు. జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాతో పాటు ఎక్సైజ్ నోడల్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, జిల్లా అధికారి సుధీర్ బాబు సమక్షంలో లక్కీ డిప్ నిర్వహించి విజేతలకు లైసెన్స్‌లు జారీ చేయనున్నారు.



బేతంచెర్ల: హెచ్ కొట్టాలలో ప్రత్యేక డ్రస్ కోడ్‌లో వినాయకుడితో యువకులు



హాలహర్వి: నిట్రవట్టి గ్రామం నుంచి గణనాథులను ట్రాక్టర్‌లో నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం



సి.బెళగల్‌లో నిమజ్జనానికి ఊరేగింపుగా తరలివెళ్తున్న వినాయక విగ్రహాలు



గోనెగండ్ల: గాజులదిన్నె ప్రాజెక్టులో గణనాథున్ని నిమజ్జనం చేస్తున్న దృశ్యం

వెళ్లి రావయ్యా.. వినాయకా!

వినాయక చవితి వేడుకలు ఊరూరా వైభవంగా కొనసాగుతున్నాయి. గణేశ్ ఉత్సవాల్లో భాగంగా బుధవారం నెలకొల్పిన విగ్రహాలను కొన్ని ప్రాంతాల్లో మూడో రోజు శుక్రవారం నిమజ్జనం చేశారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేసిన భక్తులు ఆనందోత్సవాల మధ్య వీడ్కోలు పలికారు. ఎమ్మిగనూరు, రుద్రవరం, ఉయ్యాలవాడ, కొలిమిగుండ్ల తదితర ప్రాంతాల్లో ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. కర్నూలులో చిన్న చిన్న విగ్రహాలను వినాయక ఘాట్ వద్ద పూజలు నిర్వహించి గంగమ్మ ఒడికి చేర్చారు. – సాక్షి నెట్‌వర్క్



కర్నూలు: పూజలు చేస్తున్న దృశ్యం



ఎమ్మిగనూరు: తుంగభద్రదిగువ కాలువలో క్రేన్‌తో గణనాథుడిని నిమజ్జనం చేస్తున్న దృశ్యం





రుద్రవరంలో తోపుడు బండిపై మట్టి విగ్రహాలను తీసుకెళ్తున్న దృశ్యం



వెల్దుర్తి: గోవర్ధనగిరిలో గణనాథుని లడ్డూను రూ.1.20 లక్షలకు దక్కించుకున్న సిపాయిరాజు



కొలిమిగుండ్ల: ఊరేగింపుగా వినాయక విగ్రహాల తరలింపు



ఉయ్యాలవాడలో నిమజ్జనానికి ఊరేగింపుగా వెళ్తున్న గణనాథులు



కర్నూలు వినాయక ఘాట్‌లో బొజ్జ గణపయ్యకు వీడ్కోలు పలుకుతున్న చిన్నారులు



హొళగుందలో భక్తజనం మధ్య కొనసాగుతున్న గణేశుడి శోభాయాత్ర



కుందూనదిలో గణేశ్ విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు

రోడ్డుప్రమాదంలో యువకుడి దుర్మరణం

- బైక్‌ను ఢీకొన్న బొలెరో వాహనం



వీరేంద్ర (ఫైల్)

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– ఆళ్లగడ్డ ఆర్‌అండ్‌బీ రహదారిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి అందించిన సమాచారం మేరకు.. దొర్నిపాడు మండలం క్రిష్టిపాడుకు చెందిన భీమన్న, భాగ్యమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు వీరేంద్ర(29) కోవెలకుంట్ల పట్టణంలోని స్టార్విన్ టైలర్ షాపులో టైలర్‌గా పనిచేస్తున్నాడు. దొర్నిపాడు మండలం డబ్ల్యూ గోవిందిన్నెకు చెందిన నాగమణిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు సంతానం. శుక్రవారం ఉదయం బైక్‌పై స్వగ్రామం నుంచి కోవెలకుంట్లకు బయలుదేరాడు. మార్గమధ్యలో భీమునిపాడు గ్రామం ఎస్సీ కాలనీ మలుపు వద్ద కోవెలకుంట్ల వైపు నుంచి మేకలను తరలిస్తున్న బొలెరో వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108లో స్థానిక ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. యువకుడి మృతితో క్రిష్టిపాడులో విషాదం అలుముకుంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

శ్రీశైలంలో మద్యం సీసాలు స్వాధీనం



మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం టోల్‌గేట్ సమీపంలో పోలీసులు తనిఖీలు నిర్వహించగా ఓ వ్యక్తి వద్ద నుంచి మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం సాయంత్రం శ్రీశైలం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.ప్రసాదరావు తన సిబ్బందితో కలిసి టోల్‌గేట్ వద్ద తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో శ్రీశైలం వడ్డెర కాలనీకి చెందిన దండుగల మల్లికార్జున 32 మద్యం బాటిళ్లు తరలిస్తుండగా గుర్తించి పట్టుకున్నారు. అతని వద్ద మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో పోలీసులు రాజేంద్రకుమార్, రఘునాథుడు, బాలకృష్ణ, అమర్నాథరెడ్డి, వెంకటనారాయణ, నాను నాయక్, లాల్‌సా పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారుల అభ్యున్నతికి కృషి

- విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి



విజయ డెయిరీ వార్షిక నివేదిక చదువుతున్న ఎండీ ప్రదీప్ కుమార్, చిత్రంలో చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు

కర్నూలు(అగ్రికల్చర్): పాల ఉత్పత్తిదారుల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు కర్నూలు జిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సమితి(విజయ డెయిరీ) చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. 2024–25లో వార్షిక టర్నోవర్ రూ.319 కోట్లు ఉందని, దీనిని 2025–26లో రూ.393 కోట్లకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు. విజయ డెయిరీ 38వ వార్షిక సర్వసభ్య సమావేశం కలెక్టరేట్ పక్కన ఉన్న కర్నూలు డెయిరీ ప్రాంగణంలో చైర్మన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎండీ ప్రదీప్‌కుమార్ వార్షిక నివేదికను చదవి వినిపించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ... ఈ ఏడాది 467 లక్షల లీటర్ల పాలు సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. లక్ష్యాన్ని అధిగమించేందుకు పాల ఉత్పత్తి పెంచడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. గత ఐదేళ్లుగా పాడిరైతులకు క్రమం తప్పకుండా బోనస్ చెల్లిస్తున్నామని, పాల సేకరణలో గిట్టుబాటు ధరలు కల్పిస్తున్నామని వివరించారు. పాల ఉత్పత్తిని పెంచేందుకు పాడిపశువుల కొనుగోలుకు సబ్సిడీ కూడా ఇస్తున్నామని వివరించారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

తిరుగు ప్రయాణంలో తిరిగిరాని లోకాలకు..

- కుమార్తెను విమానం ఎక్కించి వస్తుండగా ప్రమాదం
- తెలంగాణ రాష్ట్రం ఎర్రవల్లి చౌరస్తా సమీపంలో కంటైనర్‌ను ఢీ కొట్టిన ఇన్నోవా
- ఎమ్మిగనూరు వాసి దుర్మరణం
- మృతుడి భార్య, డ్రైవర్‌కు గాయాలు



ప్రమాదానికి గురైన ఇన్నోవా



మృతుడు విజయ కుమార్‌శెట్టి (ఫైల్)



గాయపడిన డ్రైవర్ ఎద్దుల వెంకటేష్

ఎమ్మిగనూరురూరల్: లండన్ వెళ్తున్న కుమార్తెను శంషాబాద్ విమానాశ్రయంలో ఫ్లైట్ ఎక్కించి తిరిగి వస్తున్న తండ్రి రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. శుక్రవారం ఉదయం జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి చౌరస్తా దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎమ్మిగనూరుకు చెందిన చిలుకూరి విజయకుమారొశెట్టి(66) మృతి చెందగా, అతని భార్య, వాహన డ్రైవర్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. పట్టణంలోని శ్రీ రామస్వామి దేవాలయం సమీపంలో నివాసముండే వ్యాపారి చిలుకూరి విజయకుమారొశెట్టి(66), మాధవి దపంతులకు కుమారుడు నైనికాంత్, కుమార్తె నందిత ఉన్నారు. పదేళ్ల క్రితం కుమార్తె నందిత వివాహం కాగా అప్పటి నుంచి ఆమె లండన్‌లో ఉంటున్నారు. కొన్ని రోజుల క్రితం ఎమ్మిగనూరుకు వచ్చిన ఆమె తిరిగి లండన్ వెళ్లేందుకు ప్రయాణమయ్యారు. ఈ మేరకు ఇన్నోవాను అద్దెకు తీసుకొని గురువారం రాత్రి 10 గంటలకు కుమార్తెతో తల్లిదండ్రులు హైదరాబాద్‌కు బయలుదేరారు. శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు శంషాబాద్‌లో కుమార్తె నందితను విమానం ఎక్కించారు. అనంతరం ఎమ్మిగనూరుకు తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి చౌరస్తా దగ్గర ముందు వెళ్తున్న కంటైనర్‌ను ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఢీ కొట్టడంతో ఇన్నోవా పల్టీలు కొట్టింది. కాగా ప్రమాదం జరిగినప్పుడు వాహనంలో ఎయిర్ బెలూన్స్ తెరుచుకున్నా విజయకుమారొశెట్టి మృతి చెందగా, అతని భార్య మాధవి, డ్రైవర్ వెంకటేష్‌కు గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందంచారు. తండ్రి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు కుమార్తె తిరిగి వస్తున్నట్లు మృతుడి కుటుంబీకులు తెలిపారు. తెలంగాణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గణేష్ లడ్డూ వేలంలో పాల్గొనాలని..

శుక్రవారం తెల్లవారుజామున కుమార్తెను విమానం ఎక్కించిన తర్వాత ఎమ్మిగనూరుకు బయలుదేరు ముందు ఒక గంట విశ్రాంతి తీసుకోమని విజయకుమారొశెట్టి డ్రైవర్ వెంకటేష్‌కు సూచించారని అతని భార్య మాధవి చెబుతోంది. అయితే ఎమ్మిగనూరులో ఈ రోజు నిమజ్జనం ఉందని, లడ్డూ వేలంలో పాల్గొనాలని, ఏమి కాదంటూ చెబుతూ డ్రైవర్ బయలుదేరాడని తెలిపింది. రాత్రంతా విశ్రాంతి లేకపోవడం, లడ్డూ వేలంలో పాల్గొనేందుకు డ్రైవర్ అతి వేగమే ప్రమాదానికి కారణమని ఆమె వాపోతోంది.

టైరు ఊడి తుఫాన్ బోల్తా

- ఐదుగురికి తీవ్ర గాయాలు
- క్షతగాత్రుల్లో ఇద్దరు ఉపాధ్యాయులు



హైవేపై బోల్తా పడిన తుఫాన్ వాహనం

పాణ్యం: కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిపై బలపనూరు గ్రామం వద్ద టైరు ఊడిపోయి తుఫాన్ వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం ఉదయం కర్నూలు నుంచి తుఫాన్ వాహనంలో డ్రైవర్ కేశవతో పాటు మరో 11 మంది నంద్యాలకు బయలుదేరారు. మార్గమధ్యలో బలపనూరు దాటిన తర్వాత తిరుమల గిరి వద్ద వాహనం వెనుక వైపు టైరు ఊడిపోవడంతో అవతల రోడ్డు పైకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో కర్నూలు విద్యా నగర్‌కు చెందిన ఉపాధ్యాయుడు రాంబాబు, విజయవాడకు చెందిన రహిమాన్, ఉపాధ్యాయుడు నాగరాజు, పుట్టపర్తికి చెందిన సాయికృష్ణ, డ్రైవర్ కేశవకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని సమీపంలోని శాంతిరామ్ ఆసుపత్రికి తరలించారు. మరి కొందరికి స్వల్ప గాయాలయ్యాయి. హైవే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వాహనాన్ని తొలగించారు.

అలా వెళ్లి.. ఇలా రావడమే!

- శ్రీశైలాన్ని వదలని ఉద్యోగులు
- అపహాస్యం అవుతున్న బదిలీలు
- రెండు నెలల్లోనే తిరిగి వస్తున్న వైనం



శ్రీశైల దేవస్థాన పరిపాలనా భవనం

శ్రీశైలంటెంపుల్: దేవదాయ శాఖలో బదిలీలు అపహాస్యం అవుతున్నాయి. కేవలం రెండు నెలల క్రితం బదిలీ అయిన వారు తిరిగి యథాస్థానికి వస్తున్నారు. ఇందుకు వీరికి అనారోగ్యకారణాలు, 888 జీఓ సహకరిస్తోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2024లో శ్రీశైల దేవస్థానం నుంచి 22 మందిని, 2025లో రెండు నెలల క్రితం పది మంది ఉద్యోగులను ఇతర దేవస్థానాలకు బదిలీ చేసింది. వీరిలో ఇద్దరు, ముగ్గురు తప్ప చాలా మంది తిరిగి వచ్చారు. దీంతో ప్రభుత్వం బదిలీలు చేయడం ఎందుకు అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

బదిలీల నిబంధనలు ఇవీ..

ఐదేళ్లు ఒకేచోట విధులు నిర్వహించిన ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం సాధారణంగా బదిలీ చేస్తుంది. ఇందులో భాగంగా శ్రీశైల దేవస్థానంలో విధులు నిర్వహించే పలువురు రెగ్యులర్ ఉద్యోగులు ఇతర దేవస్థానాలకు బదిలీ అవుతుంటారు. దేవస్థానంలో ఆలయం, అన్నదానం, వసతి, పారిశుద్ధ్యం, గోసంరక్షణ శాల, రెవెన్యూ, పరిపాలన, అకౌంట్స్, ఇంజినీరింగ్ తదితర విభాగాల్లో 300 మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నారు. అలాగే 1,600 మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

సిఫార్సులతో...

శ్రీశైల దేవస్థానంలో ఐదేళ్లు పూర్తిచేసుకున్న ఉద్యోగులకు బదిలీ అయితే వెళ్లి రెండు, మూడు నెలలు విధులు నిర్వహించి సెలవుపై వస్తారు. అటు తరువాత తమకు పరిచయం ఉన్న ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో సిఫార్సు చేయించుకుని డిప్యూటేషన్ పై శ్రీశైల దేవస్థానానికి వస్తారు. నాలుగేళ్లే డిప్యూటేషన్‌పై ఉండి సాధారణ బదిలీలలో తిరిగి శ్రీశైల దేవస్థానానికి బదిలీ చేయించుకుంటారు. అంటే ఏ దేవస్థానానికి బదిలీ చేసినా తిరిగి శ్రీశైల దేవస్థానానికి రావడం పరిపాటిగా మారింది.

తిరిగి వచ్చారు ఇలా..

కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక 2024లో మొదటిసారి సాధారణ బదిలీలలో భాగంగా శ్రీశైల దేవస్థానం నుంచి 22 మంది ఉద్యోగులను ఇతర దేవస్థానాలకు బదిలీ చేశారు. మూడు నాలుగు నెలలు తిరగకముందే వివిధ కారణాలతో వీరిలో 13మంది ఉద్యోగులు తిరిగి శ్రీశైల దేవస్థానానికి వచ్చారు. అలాగే ఈ ఏడాది శ్రీశైల దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న పది మంది రెగ్యులర్ ఉద్యోగులను ఇతర దేవస్థానాలకు సాధారణ బదిలీ చేశారు. వీరిలో బి.వి.శివారెడ్డి (అసిస్టెంట్ ఇంజనీర్), కె.గిరిజామణి, సదాశివరావు, గణపతి శ్రీశైల దేవస్థానానికి తిరిగి వచ్చారు.



2024సంవత్సరంలో ఇతర దేవస్థానాలకు బదిలీ అయిన శ్రీశైలం ఉద్యోగులను సత్కరిస్తున్న అప్పటి ఈఓ

ఇలా చేస్తే మేలు..

- ➡ రాష్ట్ర ప్రభుత్వం జీఓ 888 ద్వారా దేవస్థాన ఉద్యోగులను బదిలీలు చేస్తుంది. ఈ జీఓ 2000లో ఇచ్చారని, అంతకు ముందు విధుల్లో చేరిన ఉద్యోగులు ఈ జీఓ తమకు వర్తించదని కోర్టు మెట్లు ఎక్కుతున్నారు.
- ➡ ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, దేవదాయశాఖ ఉన్నతాధికారులు 888 జీఓను సవరించాలి. ఐదేళ్లు పూర్తిచేసుకున్న ఉద్యోగులు తప్పనిసరిగా ఇతర దేవస్థానాల్లో కనీసం మూడు సంవత్సరాలైన విధులు నిర్వహించేలా తగు చర్యలు తీసుకోవాలి.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో స్వాతి వేడుకలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని తెలుగుపేటలో వెలసిన శ్రీగణ మద్దిలేటి లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం స్వామి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకొని వేద పండితులు అత్యంత వైభవంగా స్వాతి వేడుకలు నిర్వహించారు. ఉదయం పంచామృత అభిషేకం, స్నాపన తిరుమంజన సేవా నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనం భాగ్యం కల్పించారు. అనంతరం మహాలక్ష్మి అమ్మవారికి సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మహామంగళ హారతులిచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం స్వాతి పల్లకీ సేవా సమితి ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకుడు మధుసూదన్ నారాయణ, అర్చకుడు శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కాళికాంబాదేవికి పూజలు

నంద్యాల(వ్యవసాయం): శ్రీకాళికాంబ దేవాలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషే కాలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేకంగా గాజులు, పట్టువస్త్రాలతో అలంకరించారు. ఒడి బియ్యం కార్యక్రమాన్ని నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం శ్రీకాళీ మాత సేవా సమాజ్ ఆధ్వర్యంలో అమ్మవారికి ఆలయంలో పల్లకీ సేవ నిర్వహించి అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆరవేటి వాసు, ఈఓ లక్ష్మీనారాయణ, అర్చకులు రాఘవేంద్ర, సుబ్బాచారి, విజయ్‌కుమార్, లక్ష్మీదేవి, నరసింహ పాల్గొన్నారు.

లోక కల్యాణం కోసం హోమాలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని శ్రీమతి కొత్తిసుబ్బమ్మ బాలాజీ మర్చెంట్స్ కమిటీ కల్యాణ మండపంలో లోక కల్యాణం కోసం మహాగణపతి లక్ష్మీకుబేర నవగ్రహ శాంతి హోమం నిర్వహించారు. కల్యాణ మండప నిర్వాహకులు కొత్తి కృష్ణమూర్తి, చంద్రశేఖర్ మాట్లాడుతూ 5 హోమగుండాలు ఏర్పాటు చేసి 19 జంటలతో శాస్త్రోక్తంగా పూజలు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో చరణ్‌దాస్ గుప్త, నారాయణ, సురేష్‌బాబు, సుబ్బరామయ్య, శివసాయి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

4న బహిరంగ వేలం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని చామకాల్వ వద్ద ఉన్న శ్రీప్రథమనందీశ్వరస్వామి దేవస్థానం కల్యాణ మండపం, రెండు గదుల లీజ్‌కు సెప్టెంబర్ 4వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ రామానుజన్ తెలిపారు. వేలం పాటలో పాల్గొనే పాటదారులు కల్యాణ మండపానికి రూ.లక్ష, షాపులకు రూ.50 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

శ్రీశైలం నంద్యాల జిల్లాలోనే ఉండాలి

నంద్యాల(అర్బన్): నవనందులకు నిలయమైన నంద్యాల జిల్లాలోనే శ్రీశైలం ఉండేలా చూడాలని పలువురు పట్టణ ప్రముఖులు రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్‌ను కలిసి విన్నవించారు. శ్రీశైలాన్ని వేరే జిల్లాలో కలుపుతున్నట్లు ప్రచారం జరుగుతుందని పట్టణానికి చెందిన వీహెచ్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, న్యాయవాది బాలస్వామి, గోవిందనాయుడు, రామచంద్రుడు తదితరులు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా అపోహలు నమ్మవద్దని, శ్రీశైలం నంద్యాల జిల్లాలోనే ఉంటుందని ఆయన చెప్పారు.

మైనార్టీ రుణాలు మంజూరు చేయాలి

నంద్యాల(అర్బన్): జిల్లా వ్యాప్తంగా వేలాది మంది ముస్లిం మైనార్టీలు సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారని, వారికి వెంటనే మంజూరు చేయాలని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యూనిస్ డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ సబ్సిడీ రుణాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించామని కూటమి ప్రభుత్వం చెబుతున్నా ఇంత వరకు ఒకరికి కూడా రుణం ఇవ్వలేదన్నారు. 15 నెలల కాలంలో మైనార్టీలకు ఏ ప్రయోజనం చేకూర్చారో చెప్పాలన్నారు. త్వరలో ప్రజా సంఘాలతో కలిసి ప్రభుత్వంపై పోరాటానికి దిగుతామన్నారు.

1 నుంచి కళారాధన వేడుకలు

నంద్యాల(వ్యవసాయం): వచ్చేనెల 1వ తేదీ నుంచి మాతృభూమికి కళార్చన రాయలసీమ స్థాయి విద్యార్థి సాంస్కృతికోత్సవాలు ప్రారంభమవుతున్నట్లు కళారాధన గౌరవాధ్యక్షుడు డాక్టర్ మధుసూదనరావు, ప్రధాన కార్యదర్శి రవికృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యార్థులకు 1వ తేదీన లఘుచలన చిత్ర విశ్లేషణ, చిత్రపట విశ్లేషణ, కవితారచన, తెలుగులో మాట్లాడటం, దేశభక్తి,జానపద, శాస్త్రీయ పాటలు, 2వ తేదీ వాయిద్య సంగీతం, 3న మైమ్, స్కిట్స్, మిమిక్రీ, 4న ఇంగ్లిష్ రైమ్స్, పద్యపఠనం, 5న చేతిరాత, 6న శాస్త్రీయ నృత్యం, జానపద నృత్యాలు, 7న ఆధునిక నృత్యం, దేశభక్తి నృత్యాలు, ఏకపాత్రాభినయం, 8న సంస్కృత శ్లోకాలు, కవితాగానం, పఠనం, 9న వ్యాసరచన, 10న వక్తృత్వ పోటీలు, 11న చిత్రలేఖనం, 12న క్విజ్, డ్రాయింగ్, 13న కథ చెబుతాను వింటారా, క్విజ్, స్పాట్ ఎలక్ట్రిషన్, 14న వేషధారణ పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ పోటీలన్ని రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియం, మున్సిపల్ టౌన్‌హాల్‌లో జరుగుతాయన్నారు. వివరాలకు సెల్ : 8142962974, 6300715927 లకు సంప్రదించాలని కోరారు.


శిరివెళ్ల.. నిమజ్జనానికి బయలుదేరిన గణనాథుడు


రుద్రవరంలో వినాయకుడి గ్రామోత్సవం


ఆర్.జంబులదిన్నెలో కోలాటం ఆడుతున్న బాలికలు


యర్రగుంట్లలో అన్నదానం

బై బై గణేశా!

● వైభవంగా వినాయక నిమజ్జనోత్సవం

ఆళ్లగడ్డ: వాడవాడలో కొలువుదీరిన గణనాథులను శుక్రవారం భక్తులు వీడ్కోలు పలికారు. వినాయక చవితిని పురస్కరించుకొని బుధవారం ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ఆళ్లగడ్డ, చాగలమర్రి, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, రుద్రవరం, శిరివెళ్ల పెద్ద సంఖ్యలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు ఆ విగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చివరి రోజు నిమజ్జనోత్సవం సందర్భంగా గ్రామాల్లో వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి రాత్రి పొద్దుపోయేవరకు సాగిన ఈ కార్యక్రమంలో యువకుల నృత్యాలు, డ్రమ్స్ అలరించాయి. ఓ వైపు ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నా భక్తులు ఆగకుండా గణపతి బప్పా మోరియా అంటూ ముందుకు సాగారు. సమీపంలోని చెరువులు, నీటి కుంటలు, వాగుల్లో గణనాథులను నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అహోబిలంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాటు చేసిన విగ్రహాన్ని గ్రామ సర్పంచ్ నాసారి వీరమ్మ ఆధ్వర్యంలో గ్రామ శివారులోని తెలుగుగంగ కాల్వలో నిమజ్జనం చేశారు

ఉయ్యాలవాడ : మండల కేంద్రం ఉయ్యాలవాడలో గణేష్ శోభా యాత్ర ఉల్లాసంగా సాగింది. విగ్రహాలను నిమజ్జనానికి తరలించే సమయంలో యువతి, యువకులు రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేస్తూ గణేష్ మహరాజుకు జై అంటూ గ్రామోత్సవం నిర్వహించారు. గణనాథులను ప్రత్యేక వాహనాల్లో మంగళ వాయిద్యాలతో కుందూకు తరలించి గంగమ్మ ఒడిలోకి చేర్చారు. నది ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో నది వద్ద ఎస్‌ఐ రామిరెడ్డి ఆధ్వర్యంలో ఏఎస్‌ఐలు సుదర్శన్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది, రెవెన్యూ అధికారులు భక్తులను అప్రమత్తం చేశారు.


క్రిష్టిపాడులో నిమజ్జనానికి వెళ్తున్న భారీ వినాయకుడు

రుద్రవరం: మండలంలో వందకు పైగా విగ్రహాలు ఏర్పాటు చేశారు.వీటిని శుక్రవారం ఊరేగింపు నిర్వహించి సమీప చెరువులు, వాగులు, కాల్వల్లో నిమజ్జనం చేశారు.

నంద్యాల(అర్బన్): గ్రామ గ్రామాన కొలువైన గణనాథులకు శుక్రవారం సాగనంపారు. కానాల, చాపిరేవుల, పెద్దకొట్టాల, అయ్యలూరు, పోలూరు, మిటాన్నల, పుసులూరు, పాండురంగాపురం, భీమవరం, పులిమద్ది, బిల్లలాపురం, తదితర గ్రామాల్లో ముందుగా గ్రామోత్సవాలు నిర్వహించి నిమజ్జనం చేశారు. నంద్యాల మండలం పులిమద్దిలో వరసిద్ధి వినాయక విగ్రహం ఎదుట ఏర్పాటు చేసిన లడ్డూకు వేలం నిర్వహించగా అదే గ్రామానికి చెందిన భక్తుడు వెంకటసుబ్బయ్య రూ.40,116 పాట పడి దక్కించుకున్నారు.

గోస్పాడు: మండలంలో వినాయక నిమజ్జనోత్సవం వైభవంగా జరిగింది. జూలేపల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను మినహా మిగిలిన అన్ని గ్రామాల్లో మూడు రోజులకే నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు.


శిరివెళ్లలో బందోబస్తును పర్యవేక్షిస్తున్న డీఎస్పీ

శిరివెళ్ల: భారీ పోలీస్ బందోబస్తు మధ్య మండలంలో గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగింది. గ్రామ గ్రామాన మేళ తాళాలతో డప్పు వాయిద్యాలతో వినాయకుడి గ్రామోత్సవం జరిగింది. కేసీ కెనాల్, తెలుగు గంగ, చెరువుల్లో నిమజ్జనం చేశారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛ నీయ సంఘటనలు తలెత్తకుండా సీఐ దస్తగిరి బా బు, ఎస్ఐ చిన్న పీరయ్యలు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సున్నితమైన మండల కేంద్రంలో డీఎస్పీ ప్రమోద్ మకాం వేసి బందోబస్తును పర్యవేక్షించారు.

దొర్నిపాడు: మండల కేంద్రం దొర్నిపాడులో కమిటీ సభ్యులు, గ్రామస్తులు స్వామి నిమజ్జనానికి నిరాకరించారు. శుక్రవారం సెంటిమెంట్ ప్రకారం నిమజ్జనం చేయమని చెప్పడంతో కాస్త ఉద్రిక్తత చోటుచేసుకుంది. శనివారం నిమజ్జనం చేసేందుకు పోలీసులు అనుమతి ఇచ్చారు. మిగతా గ్రామాల్లో నిమజ్జనం జరిగింది.

చాగలమర్రి: మండలకేంద్రం చాగలమర్రి ముత్యాలపాడు బస్టాండులోని ఏపీజీబీ బ్యాంకు కాంప్లెక్స్ వద్ద కొలువుదీరిన గణేషునికి శుక్రవారం ఉభయదారులు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చుండూరు వెంకటరమణ, జయలక్ష్మి దంపతులు, శ్రీఅయ్యప్పస్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహానికి ఉభయదారులు తోమ్మంద్రు రామక్రిష్ణ బాబు దంపతుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీవాసవి యువజన సంఘం అధ్యక్షుడు తోమ్మంద్రు వినోద్‌కుమర్, నాగేంద్ర కుమార్, అశ్వన్‌కుమర్, వైఎస్సార్‌సీపీ జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి పాల్గొన్నారు.


ఉయ్యాలవాడలో నిమజ్జనానికి ఊరేగింపుగా వెళ్తున్న గణనాథులు


పసురపాడులో...


గోస్పాడు.. నిమజ్జనోత్సవంలో యువకుల సంబరం


అహోబిలంలో నిమజ్జనానికి తరలి వెళ్తున్న వినాయకుడు


నల్లగట్లలో..


నంద్యాల మండలం పులిమద్దిలో లడ్డూను దక్కించుకున్న ఓ భక్తుడు


చాగలమర్రిలో ఏపీజీబీ కాంప్లెక్స్ వద్ద కొలువు దీరిన గణేషుడికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ముస్లింల సంక్షేమం పట్టదా?

బొమ్మలసత్రం: కూటమి ప్రభుత్వానికి ముస్లిం మైనార్టీల సంక్షేమం పట్టడం లేదని మైనారిటీ సంక్షేమ శాఖ ప్రభుత్వ మాజీ సలహాదారు హబీబుల్లా పేర్కొన్నారు. శుక్రవారం ఆయన నంద్యాలలో విలేకరులతో మాట్లాడారు. 'మైనార్టీల సంక్షేమం కోసం 2024–25 రాష్ట్ర బడ్జెట్‌లో రూ. 4,376 కోట్లు, 2025–26 బడ్జెట్‌లో రూ. 5,434 కోట్లు కేటాయించారు. ఇందులో ఇప్పటి వరకు ఎంత ఖర్చుచేసిందో కూటమి సర్కారు చెప్పా'లని డిమాండ్ చేశారు. కేటాయింపుల పేరుతో ప్రచారం చేసుకోవడం తప్ప ఇప్పటి వరకు ఖర్చు చేసిందేమీ లేదన్నారు. ప్రభుత్వం ఏర్పాటై 15 నెలలు కావస్తున్నా ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న సంక్షేమ పథకాల అమలు చేయలేదన్నారు. హజ్ యాత్రికుల కోసం రూ. 14 కోట్లు కేటాయించి వాటిని పూర్తిగా సద్వినియోగం చేయకపోగా హజ్ కమిటీ నిధుల ద్వారా కేవలం రూ. 72 లక్షలు 72 మందికి మాత్రమే ఇచ్చారని పేర్కొన్నారు. 1,600 మంది హజ్ యాత్రకు గన్నవరం నుంచి ప్రయాణించ లేదనే సాకుతో వారికి నిధులు చెల్లించక పోవటం బాధాకరమన్నారు. రంజాన్ ఇఫ్తార్ విందుల కోసం హజ్‌కమిటీ నుంచి రూ.1.50 కోట్లు అప్పుగా తీసుకుని తిరిగి ఆ సొమ్మును కమిటీకి ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా ముస్లింలపై చిన్న చూపు చూడకుండా ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న హబీబుల్లా

సత్ప్రవర్తన అలవర్చుకోవాలి

ఆళ్లగడ్డ: క్షణికావేశంలో నేరాలకు పాల్పడి ప్రస్తుతం జైలులో రిమాండ్ ఖైదీగా శిక్ష అనుభవిస్తున్న వారు బయటకు వెళ్లిన తర్వాత సత్ప్రవర్తనతో జీవించటానికి ప్రయత్నించాలని జిల్లా జడ్జి అమ్మన్నరాజా అన్నారు. స్థానిక ఉప కారాగారాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కారాగారంలో ఉన్న ఖైదీలతో ఏ ఏ కేసుల్లో నిందితులుగా ఉన్నారు. ఎప్పటినుంచి రిమాండ్‌లో ఉంటున్నారన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదులు ఉన్నారా అని ఆరా తీశారు. అలాగే జైలులో కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని సూచించారు. ఆర్థిక స్తోమత లేని రిమాండ్ ఖైదీలు దరఖాస్తు చేసుకుంటే ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఉపకారాగార అధికారి సెల్వంత్, ప్యానెల్ లాయర్ షహినాబేగం, డాక్టర్ నాగమస్తాన్, జైలు సిబ్బంది ఉన్నారు.


సబ్ జైలులో ఖైదీలను విచారిస్తున్న జడ్జి

రైతుబాంధవుడు భగవాన్ బలరాముడు

దొర్నిపాడు: సనాతన కాలంలోనే భగవాన్ బలరాముడు రైతులను సంఘటితం చేసి గంగానది నీటిని రైతులకు అందించిన రైతుబాంధవుడని నంద్యాల జిల్లా కిసాన్ సంఘం కార్యవర్గ సభ్యుడు సారమేకల హుసేనయ్య అన్నారు. శుక్రవారం బలరాముడి జయంతిని పురస్కరించుకొని దొర్నిపాడులో రైతులంతా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘననివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ రైతు సంఘం అధ్యక్షుడు అక్కల వేణుగోపాల్ పాల్గొన్నారు.

చాగలమర్రి: దలంలోని ముత్యాలపాడు గ్రామంలో శుక్రవారం జిల్లా కిసాన్ సంఘం అధ్యక్షుడు వైఎస్సార్ సీపీ నాయకుడు అంకాల్ రెడ్డి ఆధ్వర్యంలో బలరామ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్‌బీకే వద్ద కిసాన్ సంఘ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం బలరామ క్రిష్ణుడు, తెలుగు తల్లి చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పాములేటి, పరమేశ్వరరెడ్డి, చంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగు లాభదాయకం

గోస్పాడు: రైతులకు చిరుధాన్యాల సాగు లాభదాయకుని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి మహేష్ రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ప్రహ్లాదరెడ్డి అన్నారు. మండల కేంద్రం గోస్పాడులో శుక్రవారం రైతులతో సమావేశం నిర్వహించారు. జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని చిరుధాన్యాల రైతు ఉత్పత్తి దారుల సంఘ్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రైతులు ఆధునిక పద్ధతులను అనుసరించాలన్నారు. రోజురోజుకు పెరుగుతున్న అధునాతన విధానాలతో రైతులు పైర్ల సాగు చేయాలని సూచించారు. భారతీయ ఆహారపు అలవాట్లు దాని ప్రాధాన్యత, దేశ ప్రజల ఆరోగ్యం, విషరహిత వ్యవసాయం గురించి తెలిపారు. పండించిన పంటల విక్రయంలో మోసపోకుండా మార్కెటింగ్ చేసుకోవాలని సూచించారు. రైతాంగ సమస్యలపై రాజకీయాలకు అతీతంగా కలసి పోరాడాలన్నారు. అనంతరం పలువురు రైతులను సన్మానించారు. కార్యక్రమంలో ఆదర్శ రైతులు చెన్నప్ప, హుస్సేన్, సుజాతమ్మ, వినోద్, గోస్పాడు ఎఫ్‌బీఓ చైర్మన్ రాఘవేంద్ర, డైరెక్టర్ నాగ రాజేష్ కుమార్ రెడ్డి, శ్రీదేవి, బాలుడు, సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి మహేష్‌రెడ్డి

షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా లక్ష్మయ్య

నంద్యాల(అర్బన్): ఏపీ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం నంద్యాల జిల్లా నూతన అధ్యక్షుడిగా లక్ష్మయ్య ఎన్నికైనట్లు ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ సభ్యులుగా బజారప్ప, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భాస్కర్, వైస్ ప్రెసిడెంట్లుగా కిరణ్‌కుమార్, సుచేత, విజయ్‌కుమార్‌లు, జనరల్ సెక్రటరీలుగా అర్జున్‌రావు, కిశోర్‌బాబు, ట్రెజరర్‌గా సుబ్బరాయుడు, జాయింట్ సెక్రటరీగా గురువయ్యలను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.

సాఫ్ట్ బాల్ పోటీల్లో సత్తా చాటాలి

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 30, 31 తేదీల్లో గుంటూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి సీనియర్స్ సాఫ్ట్ బాల్ పోటీల్లో జిల్లా జట్టు ప్రతిభ చూపాలని ఫిజికల్ డైరెక్టర్ శ్రీధర్ కోరారు. శుక్రవారం క్రీడా కారులకు దుస్తుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ జిల్లా సాఫ్ట్ బాల్ క్రీడాకారులు వివిధ విభాగాల్లో సత్తాచాటారన్నారు. కార్యక్రమంలో సాఫ్ట్ బాల్ సంఘం కార్యదర్శి ఓ. విజయ్ కుమార్, జాయింట్ సెక్రటరీ ఉమా మహేశ్వరి, పీఈటీ మాధవి తదితరులు పాల్గొన్నారు.

గేదెలకు తీవ్ర గాయాలు

రుద్రవరం: మండల పరిధిలోని టి.కొట్టాలలో శుక్రవారం తెల్లవారు జామున జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు గేదెలు, రెండు దూడలు తీవ్ర గాయాలపాలయ్యాయి. విషయం తెలుసుకున్న గోపాలమిత్ర శ్రీనివాసులు వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి వైద్యం అందించడంతో గేదెలకు ప్రాణాపాయం తప్పింది. వివరాల్లోకి వెళితే.. ఈశ్వరయ్య అనే రైతు తన ఇంటి పక్కనే రేకుల షెడ్డు వేసి అందులో గేదెలను పెంచుతున్నాడు. అయితే, తెల్లవారు జామున ఉన్నట్టుండి కరెంట్‌షార్ట్‌సర్క్యూట్ అయి షెడ్డులో నుంచి మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో రెండు గేదెలు, రెండు దూడలకు గాయాలైనట్లు బాధిత రైతు తెలిపారు.

బషీర్‌బాగ్ స్ఫూర్తితో మరో ఉద్యమానికి సిద్ధం

నంద్యాల(న్యూటౌన్): బషీర్‌బాగ్ ఉద్యమ అమరవీరుల స్ఫూర్తితో విద్యుత్ భారాలపై మరో ఉద్యమానికి సిద్ధం కావాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యదర్శి శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో విద్యుత్ అమరవీరుల సంస్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2000 సంవత్సరంలో విద్యుత్‌చార్జీలను తగ్గించాలని వామపక్ష , కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో విద్యుత్ పోరాటం జరిగిందన్నారు. ఆందోళన కారులపై పోలీసులు విచక్షణా రహితంగా కాల్పులు జరపడంతో పలువురు ప్రాణాలు కోల్పోయారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను భారీగా పెంచి పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తుందన్నారు. విద్యుత్‌రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడానికి కుట్రపన్నుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి రాంబాబు, ఆటో కార్మిక సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, రాజు, సాయి, లక్ష్మణ్, చాంద్‌బాషా, రైతు కూలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

మాతృభాషపై మక్కువ పెంచుకోవాలి


చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ పోచాబ్రహ్మానందరెడ్డి


తెలుగు ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్)/(వ్యవసాయం): అమృతం కంటే కమ్మనైన మాతృభాషపై ప్రతి ఒక్కరూ మక్కువ పెంచుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ అన్నారు. నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాయన శాఖ ఆధ్వర్యంలో తెలుగుభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

● రామకృష్ణ డిగ్రీ కళాశాలలో తెలుగుభాష దినోత్సవాన్ని చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. గిడుగురామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వభాషను ప్రేమిద్దాం.. స్వదేశీ వస్తువులను కొందామనే నినాదం మనకు ఆదర్శం కావాలని సూరన సారస్వత సంఘం అధ్యక్షుడు గెలివి సహదేవుడు, సాహితీ స్రవంతి అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి అన్నారు.

శ్రీశైల పబ్లిక్ స్కూల్‌లో..

పట్టణంలోని శ్రీశైలం పబ్లిక్ స్కూల్‌లో మాతృభాష దినోత్సవం, స్పోర్ట్స్‌డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ ఎంపీ పోచాబ్రహ్మానందరెడ్డి పాల్గొని మాట్లాడుతూ ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో విద్యార్థులు క్రీడల్లో రాణించాలన్నారు. అలాగే తెలుగుభాష గొప్పతనం గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

నందిరైతు సమాఖ్య ఆధ్వర్యంలో..

ప్రతి ఒక్కరు తెలుగు వైభవానికి కృషి చేయాలని నంది రైతు సమాఖ్య గౌరవ సలహాదారుడు డాక్టర్ రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. స్థానిక భారతీ సీడ్స్ కార్యాలయంలో తెలుగుభాష పరిరక్షణ మనకర్తవ్యమనే అంశంపై చర్చ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా తెలుగు తల్లి చిత్రపటానికి గిడుగు రామ్మూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రుద్రవరం: తువ్వపల్లె తిప్పమీదున్న ఏపీ మోడల్ పాఠశాలలో శక్రవారం ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మాతృభాష, క్రీడా దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు.

అమృతం కన్న కమ్మనైది అమ్మభాష

ఆళ్లగడ్డ అమ్మభాష అమృతం కంటే కమ్మనైనదని..అలాంటి తెలుగు భాషను ప్రతి ఒక్కరూ ఆదరించాలని ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ అన్నారు. తెలుగు భాష దినోత్సవాన్ని శుక్రవారం ఆళ్లగడ్డలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి డీఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాలల సంఘం డివిజన్ అధ్యక్షుడు అమీర్‌బాషా పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్‌స్కూల్లో తెలుగు భాష, క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తల్లిదండ్రులు పిల్లలను చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి, ప్రధానోపాధ్యాయుడు విజయకుమార్ పేర్కొన్నారు.


శిరివెళ్ల: మాతృభాష తల్లి లాంటిదని ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఇంద్రావతి , శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా జరిగింది.

క్రీడల్లో రాణించాలి

నంద్యాల(న్యూటౌన్): జాతీయ క్రీడా దినోత్సవం నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో శుక్రవారం ఘనంగా జరిగింది. నంద్యాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ మాట్లాడుతూ క్రీడలు దయనందిన జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ పీఓ విజయానంద్, రమేష్‌కుమార్, రాజారెడ్డి, బాలుగ్రం, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

● నంద్యాల పట్టణంలోని గురురాజ పాఠశాలలో నిర్వహించిన క్రీడా దినోత్సవంలో ఆ విద్యాసంస్థల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పుల్లయ్య, వెంకటరెడ్డి, ముని సంజీవ, సందీప్, శశి, వెంకటేశ్వరరెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

● పట్టణంలోని కేఎస్ఎం పురపాలక ఉన్నత పాఠశాలలో నంద్యాల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు క్రీడా పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మాజీ ఒలింపిక్ చైర్మన్ డాక్టర్ రవికృష్ణ, ప్రధానోపాధ్యాయులు అసదుల్లా, జోన్ చైర్మన్ నిజాముద్దీన్ పాల్గొన్నారు.


మున్సిపల్ ఉన్నత పాఠశాలలో క్రీడా పరికరాలతో విద్యార్థులు

చాగలమర్రి: మండల కేంద్రం చాగలమర్రిలోని జిల్లా పరిషత్ బాలుర, చిన్నవంగలి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం క్రీడా, తెలుగు భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు జీవయ్య, సుధాకర్‌గుప్తాలు ప్రముఖ క్రీడాకారుడు దివంగత ధ్యాన్ చంద్, గిడుగు రామ్మూర్తి చిత్ర పటాలకు పూల మాలలు వేశారు.

గోస్పాడు: నంద్యాల గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ ఆధ్వర్యంలో క్రీడా దినోత్సవం నిర్వహించారు. మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేఖ మాట్లాడుతూ మేజర్ ధ్యాన్‌చంద్‌సింగ్ ఒలింపిక్స్‌లో మూడు సార్లు బంగారు పతకం సాధించారని గుర్తు చేశారు.